క్లుప్తంగా

నేడు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సమావేశం

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టు గ్రామం పోలీసు స్టేషన్ పక్కన అవరణలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలిరెడ్డి కృష్టారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు, మండల నాయకులు హాజరు కావాలని కోరారు.

25లోగా ఈ-క్రాప్ నమోదు

పుల్లలచెరువు: మండలంలోని రైతులు రబీలో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి సుధీర్ బాబు సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ ప్రక్రియను ఈ నెల 25లోగా చేయించుకోవాలని తెలిపారు. రైతు తమ సమీపంలోని ఆర్బీకేలో వీఏఏను సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలియజేస్తారని చెప్పారు.

ఆలయ భూముల కౌలు వేలం

పొదిలి రూరల్: నిర్మమహేశ్వర స్వామి, పొదిలి కొండ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాలకు సంబంధించిన భూములను కౌలుకు (లీజ్) ఇచ్చేందుకు వేలం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం రెండు దేవాలయాలకు సంబంధించిన భూముల వేలాన్ని పొదిలి నిర్మ మహేశ్వరస్వామి దేవాలయంలో పెద్దల సమక్షంలో నిర్వహించామన్నారు. సర్వే నెంబరు 818 లో 4.34 ఎకరాలకు రూ.4 వేలు, 816/2,3లో 3.91 ఎకరాలు రూ.4వేలు, 735/2లో 2.38 ఎకరాలు రూ. 1500, అలాగే 304/4లో 0.56 సెంట్లు పొలం, 327/9లో 0.27 సెంట్లు కలిపి రూ.5 వేలు (మాగాణి) చొప్పున ఏడాదికి వేలం పాట జరిగిందన్నారు. పొదిలి కొండ లక్ష్మీ నరసింహ స్వామి సర్వే నెంబరు 861లో 7.41 ఎకరాలు రూ.11 వేలకు కౌలు పాట జరిగినట్లు తెలిపారు.

ఏబీఎంలో అక్రమ నిర్మాణాలపై విచారణ

బేస్తవారిపేట: స్థానిక ఏబీఎం కాంపౌండ్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని రెవరెండ్ జాన్ న్యూకోంబ్ మెమోరియల్ బాప్టిస్ట్ అసోసియేషన్ సెక్రటరీ తోటకూరి దివాకర్ మార్కాపురం సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బేస్తవారిపేట పీఆర్ అండ్‌ఆర్‌డీ విస్తరణాధికారిని విచారణకు ఆదేశించారు. అక్రమ నిర్మాణాలపై తీసుకున్న చర్యలు, అనుమతులు ఇస్తే ఎటువంటి నిబంధనలు పాటించారనే విషయాలపై సమగ్ర నివేదిక ఏడు రోజుల్లో పంపాలని జిల్లా పంచాయతీ అధికారి ఆదేశించారు.

23న అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 23న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సామూహిక కుంకుమ అర్చన, లలిత సహస్ర నామాల పఠనం వంటి కార్యక్రమాలను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తామన్నారు.

రాయల్ స్కూల్ మూసివేతపై ఆందోళన

గిద్దలూరు రూరల్: స్థానిక ఒంగోలు హైవేరోడ్డులో గల రాయల్ హైస్కూల్ మూసివేయడంపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు గురువారం ఆందోళన చేపట్టారు. స్థానిక ఎంఈఓ నరసింహారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. సంక్రాంతి సెలవులు పూర్తి అయినప్పటికి స్కూల్ ప్రారంభించకపోవడంతో స్కూల్ యాజమాన్యంకు ఫోన్ చేయగా వారి వద్ద నుంచి స్పందన రాలేదని వాపోయారు. స్కూల్ వద్దకు వెళ్లి పరిశీలించి విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకెళతానని ఎంఈఓ హామీ ఇచ్చారు.

దొనకొండకు మహర్దశ



దొనకొండలో జేసీబీతో చేస్తున్న పనులు

దొనకొండ: దొనకొండకు మహర్దశ వచ్చింది. రూ.2.60 కోట్ల నిధులతో తారు రోడ్డు, సిమెంటు రోడ్డు, సైడు కాలవలు మంజూరయ్యాయి. ఆర్‌అండ్‌బీ డీఈ జి.కృష్ణ, ఏఈ మంజూష సమక్షంలో రోడ్డు పనులు చేపట్టారు. పెదన్నపాలెం నుంచి దొనకొండ ఇండియన్ పెట్రోలు బంకు వరకు తారు రోడ్డు, అక్కడి నుంచి రైల్వే స్టేషన్ ఆవరణ వరకు సీసీ రోడ్డు, సిమెంట్ కాలువలు నిర్మించేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఎన్నో రోజుల నుంచి అవస్థ పడుతున్న దొనకొండ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో మేలు

గిద్దలూరు రూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ అన్నారు. ముండ్లపాడు, బురుజుపల్లె గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, రైతు భరోసాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి



బేస్తవారిపేట: బహుమతులు పంపిణీ చేస్తున్న యోగా టీచర్, హెచ్‌ఎంలు



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి



మార్కాపురం: వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు



కంభం: యోగివేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



గిద్దలూరు: వేమన జయంతి నిర్వహిస్తున్న నిర్వాహకులు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో అనంతపురం వేమన ఫౌండేషన్ సహకారంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేమన పద్యాలపై 3వ తరగతి నుంచి పదోవ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి బహుమతులు, ప్రశంస పత్రాలు, మెడల్స్ అందజేశారు. సీనియర్స్ విభాగంలో డీవీ మణికంఠ, రిషాద్, కేవీ చరణ్, జూనియర్స్ విభాగంలో కె. అఖిల్, మన్సూర్, డి. పవన్, సబ్ జూనియర్ విభాగంలో చల్లా కీర్తన గెలుపొందారు.

యోగి వేమనకు ఘన నివాళి

పెద్దారవీడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో యోగి వేమన జయంతిని గ్రంథపాలకుడు డీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాసు వెంకటరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమన కవిత్వం అజరామరం

మార్కాపురం టౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. పండిత, పామురులకు అర్థమయ్యే సరళ రీతిలో అతి సులువైన వాడుక భాషలో సమాజంలో జరుగుతున్న అనేక అంశాలపై పద్యాలను రూపొందించారన్నారు. సమాజంలోని రుగ్మతలను, మూఢ నమ్మకాలను తనదైనశైలీలో తమ వాగ్గేయ కవిత్వం ద్వారా ప్రజలకు నాలుకలపై నేటికి సజీవంగా నిలిపిన మహాకవి వేమన అన్నారు. ఆయన పద్యాలు తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదన్నారు. సీపీ బ్రౌన్ తన పరిశోధనలతో దాదాపు 5500 పద్యాలను ఆంగ్లంలో అనువదించడం వేమన గొప్పతనానికి నిదర్శనమన్నారు. ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, ప్రభాకర్ రెడ్డి, జీఎల్ రమేష్, రత్నరాజు, భాస్కర్‌రెడ్డి, డి.వెంకటరెడ్డి, వినోద్, సమీఉల్లా, ప్రసాద్, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యోగి వేమన 611వ జయంతిని సంఘం కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. సంఘ నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, లక్ష్మీరెడ్డి, చిన్న వెంకటరెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, కంది ప్రమిలారెడ్డి, వెంకట రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

కంభం: యోగి వేమన జయంతిని గురువారం కంభంలో ఘనంగా నిర్వహించారు. కంభం, అర్ధవీడు యోగివేమన రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. పిచ్చిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, అంజిరెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, గొంగటిచెన్నారెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గిద్దలూరు రూరల్: స్థానిక వేమన సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో వేమన జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ రాజారమేష్ ప్రేమ్‌కుమార్ వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి, హనుమంతారెడ్డి, వంశీక్రిష్ణ, శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల సమావేశం జరగాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ మాట్లాడారు. ప్రతి సమస్యను కూలంకషంగా చర్చించి సమష్టిగా నిర్ణయం తీసుకుని శాశ్వత పరిష్కార మార్గం చూడాలన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకునేందుకు నాయకులు, అధికారులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. జల జీవన్ మిషన్ పథకం కింద ప్రభుత్వం ఇంటింటికీ కుళాయి వేసి శాశ్వతంగా తాగునీటి సమస్య తీర్చేందుకు మండలానికి రూ.22 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణానికి ప్రజలు సహకరించి స్థలాలు చూపాలని కోరారు. వినుకొండలో రాత్రి 9 గంటలకు బస్సు బయల్దేరాలని, త్రిపురాంతకం నుంచి దర్శి వరకు వయా దేకనకొండ మీదుగా బస్సు నడపాలని, వినుకొండ నుంచి దొనకొండ మీదుగా మార్కాపురం బస్సు నడపాలని సమావేశంలో తీర్మానం చేసి ఆర్టీసీ ప్రతినిధికి తెలిపారు. మండల పరిషత్ ప్రాంగణంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటుకు తీర్మానం చేయాలని కోరారు. మండలంలోని బౌద్ధక్షేత్రాన్ని జిల్లా అధికారులు పొరపాటున దొనకొండ మండలంగా ప్రకటిస్తున్నారని, దాన్ని కురిచేడు మండలానిదని చెప్పేందుకు బౌద్ధ క్షేత్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఒక రోజు కార్యక్రమం రూపొందించాలని జెడ్పీటీసీ సూచించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ ఏర్పాటుకు ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ సభాముఖంగా అంగీకారం తెలిపారు. ప్రతి సమావేశంలో ప్రజల నుంచి ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చే సమస్యలు మళ్లీ జరిగే సమావేశంలో ఏ మేరకు ప్రగతి సాధించారనే విషయాలను సంబంధిత శాఖల అధికారులు తప్పక తెలియజేయాలని ఎంపీడీఓ భవ్య ఆదేశించారు. ప్రతి రైతుకు వ్యవసాయ యాంత్రీకరణ కింద పనిముట్లు ఇవ్వనున్నట్లు వ్యవసాయాధికారి ప్రకాశ్ తెలిపారు. పీఎం కిసాన్, రైతు భరోసా పథకాలకు అవకాశం ఉందని, రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీలు అన్నెం అరుణ, షేక్ కాశీంబీ, ఎంపీటీసీలు బుల్లం వెంకట నర్సయ్య, పునుగుపాటి పార్వతి, ఆవుల లక్ష్మీ వెంకటరెడ్డి, గండి అంకమ్మ, సర్పంచ్‌లు కాసు భాస్కరరెడ్డి, ఆసుపల్లి రామలక్ష్మమ్మ, కేసనపల్లి కృష్ణయ్య, మారెల్ల వెంకటకాశీ చెన్నకేశవులు, తహసీల్దార్ షేక్ నాగూల్ మీరా, అన్ని శాఖల అధికారులు, నాయకులు గొట్టిపాటి బాలకోటయ్య, సాదం నాసరయ్య పాల్గొన్నారు.

ఆధార్ మొబైల్ శిబిరాలకు విశేష స్పందన



మిల్లంపల్లిలో ఆధార్ మొబైల్ శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆధార్ మొబైల్ శిబిరాలకు మంచి స్పందన లభిస్తోందని ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు తెలిపారు. గురువారం గోళ్లవిడిపి, అమానిగుడిపాడు, మిల్లంపల్లి, కొలుకుల పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఆధార్ మొబైల్ శిబిరాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా శిబిరాల్లో 190 మంది ఆధార్ అప్‌డేట్తోపాటు ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకున్నారని వివరించారు. ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆధార్ మొబైల్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూలీలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ సాంబశివుడు



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

యర్రగొండపాలెం: ఉపాధి హామీ పథకం కూలీలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు హెచ్చరించారు. గురువారం చెన్నరాయునిపల్లెలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. కూలీల వద్ద డబ్బు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, కూలీలు ఎవరికీ డబ్బు ఇవ్వనవసరం లేదని చెప్పారు. ఎవరైన డబ్బు డిమాండ్ చేసినట్లయితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఉపాధి హామీ పనులపై అవగాహన

పెద్దారవీడు: మండలంలోని సుంకేసుల గ్రామంలో ప్రజలకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులపై ఏపీఓ సాంబశివుడు గురువారం అవగాహన కల్పించారు. ఏపీఓ మాట్లాడుతూ.. రోజుకు కనీస వేతనం రూ.257 రావాలంటే ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం 4 గంటలు పని చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రజలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడ్డెపోగు రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సానికొమ్ము మల్లారెడ్డి, సీనియర్ మేట్ ప్రసాద్, కూలీలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

త్రిపురాంతకం: మండలంలోని మేడపిలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

పుల్లలచెరువు: మండలంలోని చాపలమడుగు, ఉమ్మడివరం గ్రామాల్లోని యూపీ పాఠశాలలను గురువారం ఎంఈఓ శామ్యూల్‌జాన్ తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్, డైరీలు, ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు రోజూ యూనిఫాం ధరించి పాఠశాలలకు వచ్చేలా చూడాలన్నారు. ఇటీవల నిర్వహించిన ఎస్‌ఏ-1 పరీక్షల్లో ప్రతి తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులను అభినందించారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

విద్యార్థి దశ నుంచే నిబంధనలు తెలుసుకోవాలి

దర్శి: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు నిబంధనలు తెలుసుకోవాలని ఎంవీఐ రవికుమార్ సూచించారు. 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు రెండో రోజు స్థానిక ఎంవీఐ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకుంటే పెద్దయ్యాక మంచి డ్రైవింగ్ చేస్తారని చెప్పారు. రోడ్డుపై నడిచి వెళ్లేప్పుడు ఎడమ చేతి వైపునే రోడ్డు దిగి నడవాలని సూచించారు. అకస్మాత్తుగా రోడ్డు దాటరాదని, ట్రాఫిక్ చూసుకుని నిదానంగా చేతులు చూపిస్తూ వెళ్లాలని సూచించారు. నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

త్రిపురాంతకం: ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ, నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తోందని ఎంఈఓ కె తులసి మల్లికార్జుననాయక్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మెయిన్ స్కూల్లో నాడు-నేడు పనులు, మధ్యాహ్న భోజనాన్ని గురువారం పరిశీలించారు. పాఠశాల రికార్డులు పరిశీలించి తగిన సూచనలిచ్చారు. ఎంఈఓ మాట్లాడుతూ.. నాడు-నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని, సబ్జెక్టుల వారీగా పరిశీలించాలన్నారు. ఎంఈఓతోపాటు హెచ్‌ఎం ఆవుల వెంకటేశ్వర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఆదినారాయణ రెడ్డి, సీఆర్పీ చాంద్‌వలి, ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ప్రమాదం జరిగిన స్థలంలో ఉన్న కారు, రిక్షా

పొదిలి రూరల్: రిక్షా, కారు ఢీ కొని ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన పొదిలి-దర్శి రహదారిలో రాంనగర్ వద్ద గురువారం జరిగింది. నరసరావుపేట నుంచి కనిగిరి వెళ్ళుతున్న కారుకు, పొదిలి రాంనగర్ వద్ద రిక్షా అడ్డురావడంతో ఢీకొట్టింది. రిక్షా పుల్లర్ రాములుకి గాయాలవడంతో పొదిలి ఆసుపత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారిపేట: మండల కేంద్రం బేస్తవారిపేట, కంభం, అర్ధవీడు మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డీఈఈ బాల అంకయ్య తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కంభం 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం



గడప గడపలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

మార్కాపురం: ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి గురువారం ఉదయం పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలోని 7వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు చైర్మన్ జి. శ్రీనివాసరెడ్డి ప్రధాన కార్యదర్శి పత్తి రవిచంద్ర, బొగ్గరపు శేషయ్య, కౌన్సిలర్‌లు కొత్త కృష్ణా, సిరాజ్, షెక్షావలి, బుశ్శెట్టి నాగేశ్వరరావు, మహిళ సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు దొడ్డా భాగ్యలక్ష్మి, వై. రంగలక్ష్మమ్మ, షెక్షావలి, మయూరి కాశిం, జీ.చెన్నారెడ్డి, రోజ్‌లిడియా, ఉత్తమ్‌కుమార్, మైనారిటి సెల్ అధ్యక్షులు షేక్ ఉస్మాన్, నాగ సుధీర్, మున్సిపల్ కమీషనర్ గిరికుమార్, డీఈ సుభానీ, ఏఈలు, సచివాలయం, వలంటీర్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



పొదిలి డిపోను పరిశీలిస్తున్న ఆర్‌ఎం సుధాకర్ రావు

గిద్దలూరు రూరల్: ప్రజల నుంచి రెవెన్యూ పరంగా వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో అలసత్వాన్ని విడనాడి విధులు నిర్వహించాలని సూచించారు. తిమ్మాపురంలోని పంట పొలాల రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. తహసీల్దార్ మాతాంగి రాజారమేష్ ప్రేమ్‌కుమార్, డీటీ ప్రసాదరావు, సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన ఆర్‌ఎం

పొదిలి రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోను రీజినల్ మేనేజర్ సుధాకర్‌రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కంట్రోల్ పాయింట్‌లో ఉన్న చార్ట్‌ను పరిశీలించారు. అనంతరం డిపో ఆవరణలో ఉన్న షాపులను, మంచినీటి కుళాయిలను, మరుగుదొడ్లను, వాహనాల స్టాండ్‌లను పరిశీలించారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సంక్రాంతికి మంచి లాభాలు వచ్చాయన్నారు. డీఎం సుందరరావు, సీఐ ధనలక్ష్మి, సిబ్బంది ధనమ్మ, షరీషా ఉన్నారు.

అర్జీలను వెంటనే పరిష్కరించండి

పొదిలి రూరల్: స్పందనలో వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని కనిగిరి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ సందీప్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ భూములు ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో అమలవుతున్న భూరీసర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు డి. భాగ్యలక్ష్మి, వీఆర్వోలున్నారు.

మితిమీరిన వేగం ప్రమాదకరం

● ఎంవీఐ అమర్ నాయక్



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న మోటార్ వెహికల్ అధికారులు

త్రిపురాంతకం: అతి వేగం అత్యంత ప్రమాదకరమని, వాహనదారులు మద్యం సేవించి ప్రమాదాలకు గురికావద్దని మోటారు వెహికల్ అధికారి బి.అమర్‌నాయక్ సూచించారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ.. డ్రైవింగ్‌లో వాహనదారులు తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ఇటీవల కాలంలో ప్రమాదాలు పెరిగాయన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దన్నారు. అవగాహన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మాదవరావు, కానిస్టేబుల్ కరీమ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో బ్యాంక్ సేవలు



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ రామకృష్ణారావు

తర్లుపాడు: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ తర్లుపాడు శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మీర్జాపేట గ్రామంలో గురువారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. మ్యాజిక్ షో నిర్వహిస్తూ డిపాజిట్ పథకాల రుణ సౌకర్యాల గురించి వివరించారు. మేనేజర్ టీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ 11 కోట్ల రూపాయలు డిపాజిట్ రూపంలో సేకరించి 30 కోట్ల రూపాయల రుణం మంజూరు చేసినట్లు తెలిపారు. డిపాజిట్‌లపై అధిక వడ్డీ చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఖాతాదారులు ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. రైతులకు ట్రాక్టర్‌లు, గృహ నిర్మాణాలు, వ్యవసాయ పనిముట్లు, పంట రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ హెప్సిబా, క్యాషియర్ అనూష, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



ఉమ్మడివరం పాఠశాలలో విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ

పుల్లలచెరువు: విద్యార్థుల అభివృద్ధికి దాతలు సహకరించడం ఎంతో అభినందనీయమని ఎంఈఓ శామ్యూల్‌జాన్ పేర్కొన్నారు. గురువారం ఉమ్మడివరం పాఠశాలలోని విద్యార్థులకు సార్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేశారు. విద్యార్థులకు మరింత సహకారం అందిస్తామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.